క్లుప్తంగా

బార్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ



ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాంలో ఉన్న ఎంఎస్ఆర్ బార్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారి తారా సింగ్ నాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా బార్‌లో కాలం చెల్లిన ఫుడ్‌కలర్, సాస్, టెస్టింగ్ సాల్ట్‌ను సీజ్ చేశామని తెలిపారు. కుళ్లిన, నిల్వ ఉంచిన మట్టన్ కీమా, చికెన్‌ను చెత్త కుప్పలో పడివేసినట్లు చెప్పారు. శాంపిల్స్‌ను కలెక్ట్ చేసి ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను అతిక్రమించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు కోరారు. ఈమేరకు వారు గురువారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల శ్రమ ఎంతగానో ఉందన్నారు. కానీ వారి శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాయకులు, పంచాయతీ కార్మికులు రమేష్, రవి, ప్రభాకర్, మహేష్, మోహన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బడులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని బడులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం ఎంతో విచారకరమన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని స్టేషనరీ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని తాగుతున్నారని, వెంటనే ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశాడు. ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దామ సునీల్, దుర్గా దాస్, సాయి, జగదీష్, శైలేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

22న న్యూరో సైకియాట్రిక్ మహాసభలు



నిజామాబాద్‌నాగారం: నగర శివారులోని కృష్ణ హోటల్‌లో ఈనెల 22, 23 తేదీలలో ఇండియన్ సైకియాట్రిక్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ బ్రాంచ్, ఇందూర్ న్యూరో సైకియాట్రిక్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో న్యూరో సైకియాట్రిక్ పదవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విశాల్ ఆకుల తెలిపారు. ఖలీల్‌వాడీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచే కాకుండా వివిధ జిల్లాల మానసిక వైద్య నిపుణులు, అలాగే పీజీ విద్యార్థులు పాల్గొనను న్నట్లు తెలిపారు. 23న డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన సదస్సు ఉంటుందన్నారు. విద్యార్థులతో వాక్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



సిరికొండ: సకాలంలో వర్షాలు కురవాలని మండలంలోని గడ్కోల్ గ్రామంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా గోదావరి నుంచి గంగాజలాలను తీసుకొచ్చి డప్పువాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం జలాలతో గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. వీడీసీ చైర్మన్ మామిడి రాములు, నిమ్మల భాస్కర్, గంగాధర్,నవీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చెత్త వాహనాలు ఎంత భద్రం?

- లైసెన్సు లేని డ్రైవర్లకు శిక్షణ
- పలు వాహనాలకు ఫిట్‌నెస్ కరువు
- నగరంలో ప్రమాదవశాత్తు మున్సిపల్ కార్మికురాలి మృతి



నగరంలో చెత్తను తరలిస్తున్న చెత్త సేకరణ ట్రాక్టర్ (ఫైల్)

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ పరిధిలోని చెత్త వాహనాలు ఎంత భద్రమోననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ కోసం నిత్యం చెత్త సేకరణ వాహనాలు తిరుగుతునే ఉంటాయి. కానీ వాటిలో కొన్ని వాహనాలను ఫిట్‌నెస్ లేకుండానే తిప్పుతున్నట్లు తెలుస్తోంది. అలాగే డ్రైవర్లకు సైతం లైసెన్సు లేకున్నా, శిక్షణ ఇచ్చి వాహనాలను నడిపిస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రమాదాలు ఎప్పుడు ఏవైపు నుంచి వస్తుందోనని మున్సిపల్ కార్మికులతోపాటు, ప్రజలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గురువారం ఓ కార్మికురాలు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి చనిపోవడంతో వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హతలపై అనుమానాలు కలుగుతున్నాయి..

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్ నగరంలో 60 డివిజన్లు, ఆరు జోన్ కార్యాలయాలున్నాయి. ఇందులో జోన్-1(నాందేవాడ), జోన్-2(గోల్‌హనుమాన్), జోన్-3(పెద్దబజార్), జోన్-4ఎ(రాజీవ్‌గాంధీ ఆడిటోరియం), జోన్- 4బి(కంఠేశ్వర్), జోన్-5(అర్సపల్లి)లున్నాయి. వీటి పరిధిలో టిప్పర్‌లు-10, చెత్త ట్రాక్టర్‌లు-32, మినీ టాటా వాహనాలు-68 ఉన్నాయి. వీటికి సంబంధించి 124 మంది డ్రైవర్లు ఉన్నారు. నగరమంతా చెత్త వాహనాలు ఇంటింటికీ తిరుగుతూ ప్రతినిత్యం 150 నుంచి 200 టన్నుల్లో చెత్తసేకరణ చేసి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. వీటి ద్వారా ప్రతినిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు చెత్త సేకరణ జరుగుతునే ఉంటుంది. కానీ చాలా వాహనాలకు ఫిట్‌నెస్ లేదని, వాహనాలు బ్రేక్‌లు సక్రమంగా పని చేయవని ఆరోపణలు ఉన్నాయి. వాహనాలకు ఫిట్‌నెస్ గడువు ముగిసినా రెన్యూవల్ చేయించడం లేదంటున్నారు. దీంతోపాటు కొంతమంది డ్రైవర్లు లైసెన్సు లేకుండానే చెత్త వాహనాలు తిప్పుతున్నారంటున్నారు. డ్రైవర్లకు కచ్చితంగా లైసెన్సు ఉండాల్సిందే. లైసెన్సు లేకుండా వాహనాలు తిప్పడం చట్టరీత్య నేరం. వాహనాల ఫిట్‌నెస్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల నగరంలో చెత్త ట్రాక్టర్ పైనుంచి ఓ మహిళ కార్మికులు ప్రమాదవశత్తూ మృతిచెందింది. దీంతో వాహనాలపై ఫిట్‌నెస్‌పై, డ్రైవర్ల లైసెన్సులపై అనుమానాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని, అర్హతలు ఉన్న డ్రైవర్లను నియమించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్ పరిశీలన చేస్తాం

నగరంలోని చెత్త వాహనాలకు ఫిట్‌నెస్ ఉంది. గురువారం ఓ మహిళ కార్మికులు ట్రాక్టర్ కింద పడి చనిపోయింది. అయితే ఈ వాహనానికి ఫిట్‌నెస్ ఉందో లేదో పరిశీలన చేస్తాను. కాగితాలు చెక్ చేస్తాను. ఒకవేళ లేకుంటే కచ్చితంగా అన్ని వాహనాలకు ఫిట్‌నెస్ చేయిస్తాం.

– మురళి, ఏఈ, వాహనాల ఇన్‌చార్జి

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి



అర్సపల్లిలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ అర్బన్: విద్యార్థులు మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు పేర్కొన్నారు. నగర పరిధిలోని అర్సపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగులను పూర్తిగా నిర్మూలించుకోవాలన్నారు. నీతూకిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యని అభ్యసించి ఉన్నతంగా ఎదగగలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాంరాథోడ్, జిల్లా టీకాల అధికారి అశోక్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల గురించి వివరించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 429350 (94.31 శాతం) మంది విద్యార్థులకు ఈ మాత్రలు అందించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. మిగిలిన వారికి 27న మళ్లీ వేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు మాత్రలు వేశారు. మెడికల్ ఆఫీసర్ సామ్రాట్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు సంతోష్ కుమార్, హెచ్‌ఎం శంకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఖలీల్‌వాడి: నీట్ పరీక్ష లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్షలకు బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, బీహార్‌లో ఒక్కొక్క విద్యార్థి దగ్గర రూ.30 నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసి పేపర్ లీకేజీకి పాల్పడటం జరిగిందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి నీట్ పరీక్ష అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని, తిరిగి నీట్ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు పెద్ద వెంకట రాములు, నూర్జహాన్, శంకర్‌గౌడ్, వెంకటేష్, సుజాత, విగ్నేష్, మహేష్, సూరి, రాములు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం



యోగా గురువులను సన్మానిస్తున్న నిర్వాహకులు..



సుభాష్‌నగర్‌లో..

నిజామాబాద్‌నాగారం: యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం పొందవచ్చని రిటైర్డ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కిషన్ అన్నారు. వినాయక్‌నగర్‌లోని పతాంజలి యోగా సెంటర్‌లో గురువారం జేసీఐ అలుమ్ని క్లబ్ జోన్ 12 ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా యోగా గురువులు యోగారత్న ప్రభాకర్, కిషన్, బాలశేఖర్, బంటు సంతోష్, భూమాగౌడ్, గంగాధర్, తిరుమల్‌లను, నిర్వహకులు జలంధర్‌గౌడ్‌లను సన్మానించారు. యోగా శిక్షకులు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసాధకులకు బహుమతులు..

నగరంలోని సుభాష్‌నగర్ ఆరోగ్య రక్ష కేంద్రంలో యోగా దినోత్సవం సందర్భంగా గురువారం డిస్ట్రిక్ లెవెల్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను న్యాయవాది రాజ్ కుమార్, శ్రీధర్ అందజేసి సన్మానించారు. ఐశ్వర్య, గంగాధర్, కమలవాణి, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, రజిత ఉన్నారు.

సమాచారం..

రేపు మున్సిపల్ సమావేశం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 22న మున్సిపల్ నూతన భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ మంద మకరందు ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశం మేయర్ నీతూకిరణ్ అధ్యక్షతన ఉదయం 10.30గంటల నుంచి జరగనుందని తెలిపారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, కార్పొరేటర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

విద్యుత్‌శాఖ సీఎండీ రాక

నిజామాబాద్‌నాగారం: ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం జిల్లాకు రానున్నారు. బోధన్‌లో గురువారం బోధన్ ఏఈ రవిచంద్ర(47) రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో నేడు నిర్వహించే అంత్యక్రియలకు ఆయన హాజరుకానున్నారు.

సంక్షిప్తం

నగరంలో వాహనాల తనిఖీ



ఖలీల్‌వాడి: నగరంలోని పెద్దబజార్ వద్ద గురువారం పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 50 వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలి పారు. నంబర్ ప్లేట్లు, ధ్రువపత్రాలు లేని వాహ నాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామ న్నారు. అలాగే మైనర్లు నడిపిన వాహనాలను సీజ్ చేశామన్నారు. వాహనాల తనిఖీలో సీఐ నరహరి, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఆర్ఎస్సై సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

ఇందల్వాయి: మండలంలోని గండితండా ప్రాథమిక పాఠశాలకు గురువారం వ్యవసాయ శాస్త్రవేత్త అనీలా రూ.10వేల విరాళం అందించినట్లు ఎంపీడీవో అనంత్ రావు గురువారం తెలిపారు. విరాళంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఇతర స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేసి అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా తారక్‌నాథ్ వర్ధంతి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో గురువారం



తారక్‌నాథ్ వర్ధంతి, యూనియన్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులు తారక్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలువేసి, రక్తదానం చేశారు. ఎస్‌బీఐ నిజామాబాద్ మాడ్యూల్ డీజీఎస్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రావు, ఏజీఎస్‌లు శ్రీనివాస్, గురునాథ్, ఆర్ఎస్ శ్రీనివాస్, సునంద, సుధాకర్, శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రెజరర్ అరవింద్ పాల్గొన్నారు.

గోమాతకు వైద్యచికిత్స



సుభాష్‌నగర్: నగర శివారులోని రైలు పట్టాలపై గోమాత అనారోగ్యానికి గురై ఉండటంతో స్థానికులు వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి దాత్రిక రమేష్‌కు సమాచారమిచ్చారు. వెంటనే రమేష్, గోసేవకులతో అక్కడికి చేరుకుని గోమాతను ఆటో, స్ట్రెచర్ సాయంతో కోటగల్లిలోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం గోమాతకు చికిత్స అందుతుందని రమేష్ తెలిపారు. సాకేత్, హరీష్‌రెడ్డి, బడంగి రణదీప్, వర్ధన్, నాని, నవీన్, నిరీష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు సన్మానం



ఖలీల్‌వాడి: గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఈవీఎంలు, ఎన్నికల అధికారుల సమావేశాలకు వెళ్లిన ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజనరేందర్‌గౌడ్‌ను, జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

ఎంపీపీ నర్సయ్యకు..

డిచ్‌పల్లి: ఎంపీపీ చిన్నోల్ల నర్సయ్యను గురువారం ముల్లంగి(ఐ) మున్నూరుకాపు పెద్ద సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని వారు ఎంపీపీని కోరారు. భూపతి, నరేష్, రాజు, శ్రీనివాస్, లక్ష్మయ్య, నారాయణ, రవి, సుమన్, సాయిలు, లింగారెడ్డి, సతీష్, శేఖర్, నరేందర్ పాల్గొన్నారు.

నేటి చిత్రం..



వేణుమాల్ చౌరస్తాలో ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన డ్రైయినేజీ

డ్రైయినేజీని శుభ్రం చేయండి

నగరంలోని వేణుమాల్ చౌరస్తా వద్ద డ్రైయినేజీ ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయింది. దీంతో మురుగునీరు సరిగా వెళ్లకపోవడంతో పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. తిరుమల టాకీస్ వెళ్లే రోడ్డు పక్కనే భారీ డ్రైయినేజీ ఉండడంతో నీటి ప్రవాహం అంతంత మాత్రంగా ప్రవహిస్తుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైయినేజీని శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బడా రాంమఠం భూముల పరిశీలన



న్యాల్‌కల్‌లో భూమిని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లి, సిర్పూర్, న్యాల్‌కల్ గ్రామాల్లో బడా రాంమఠం (దేవాదాయ, ధర్మాదాయశాఖ, బ్రహ్మపురి, గాజుల్‌పేట్) భూములను దేవాదాయశాఖ ఈవో వేణు, సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా భూముల కౌలు వేలం విషయంలో సాగు చేసుకుంటున్న రైతులతో చర్చించారు. ముదక్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 190లో 2.04 ఎకరాల భూమిని పరిశీలించి వీడీసీ తోపాటు కౌలు చేస్తున్న తూర్పు నారాయణతో సమావేశమయ్యారు. కౌలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిర్పూర్‌లో సర్వేనెంబర్ 646, 647లో 2.04 ఎకరాలు కౌలు చేస్తున్న వెల్మ సాయిరెడ్డిని బకాయి కౌలు చెల్లించాలని సూచించారు. అనంతరం న్యాల్‌కల్‌లో 662 సర్వేనెంబర్‌లో 1.19 ఎకరాల భూమి కౌలు చేస్తున్న పంతుల సునీతకు గతంలో చెల్లించిన కౌలు రషీదులు చూపించి, బకాయిలతోపాటు ఈఏడాది కౌలు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. సిబ్బంది నాగరాజు, ప్రశాంత్, కౌలు రైతులు ఉన్నారు.

24న ఎండీఎం కార్మికుల ధర్నా



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఈనెల 24న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నాను నిర్వహించనున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘ నాయకులు తెలిపారు. ఈమేరకు వినతిపత్రాన్ని గురువారం వారు జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీకి అందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనము, గుడ్డు బిల్లును వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10000 గౌరవ వేతనము అమలు చేయాలని కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనాల అమలు చేయాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ధర్నాలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రతినిధులు చామంతి లక్ష్మీ, సుజాత, లక్ష్మీ, శిరీష, పోశెట్టి, సుదర్శన్‌రెడ్డి, రజియాబేగం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,000	వెండి (కిలో)	93,500
22 క్యారెట్స్	67,200		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	60	80	గాజరుగడ్డ	35	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	70	90
బీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	30	50
జిర్నిసుకాయ	80	100	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	80	గోబిపువ్వు	25	50
వంకాయ	35	60	బీట్‌రూట్	25	50
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	60	90	గోరుచిక్కుడు	60	90
పుదీనా	60	90	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శికి..

సిరికొండ: బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతకుంట రామస్వామిని గురువారం ఆయన స్వగ్రామం గడ్కోల్‌లో పార్టీ నాయకులు సన్మానించారు. గ్రామానికి చెందిన నా యకుడికి రాష్ట్రస్థాయి పదవి దక్కడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. నాయకులు పెద్దకొండయ్య, రామాగౌడ్, భాస్కర్, వెంకగౌడ్, ఆశన్న, పోశెట్టి, అశోక్,భాస్కర్, బాలయ్య ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మహారాజ(తెలుగు)- 1.45,4.40, 7.35,10.3
స్క్రీన్-2	ఓమైగాడ్(తెలుగు)-11.10,4.35 ప్రభుత్వజూనియర్‌కళాశాల(తెలుగు)-1.40 నింద(తెలుగు)-7.30,10.25
స్క్రీన్-3	హనీమూన్ ఎక్స్‌ప్రెస్(తెలుగు)- 1.45 మనమే(తెలుగు)-4.40,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మహారాజ(తెలుగు)-11.05,4.30, 7.35,10.40-మరణం(తెలుగు)-2.10
స్క్రీన్-2	ఇన్‌సైడ్ అవుట్-2(3డీ ఇంగ్లీష్)-11.25 5.00 ఏ (తెలుగు)-1.50 జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ (హిందీ)- 7.25 ముంజ్య(హిందీ)- 10.35
స్క్రీన్-3	ఓమైగాడ్(తెలుగు)-11.15,7.55 హనీమూన్ ఎక్స్‌ప్రెస్(తెలుగు)-2.00 హరోంహర(తెలుగు)-4.40 చందు చాంపియన్(హిందీ)-10.40
స్క్రీన్ -4	ఇట్లు మీ సినిమా(తెలుగు)-11.45 నింద(తెలుగు)-2.20,7.50 ప్రభుత్వ జూనియర్ కళాశాల(తెలుగు)-5.00 మనమే(తెలుగు)-10.30
దేవి	మహారాజా (తెలుగు)
నటరాజ్	చందు చాంపియన్(హిందీ)
విజయ్	నింద(తెలుగు)